RNI.No. TELTEL/2010/32434

TELANGANA RISING 2047

అన్వేషనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 20 | గురువారం 14 మే 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



## బలపరీక్షలో నెగ్గిన తమిళనాడు సీఎం విజయ్

తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. నేడు జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది.



2 లో..

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

- రైతులు, రైల్వేలు, పరిశ్రమలకు భారీ ఊతం
- ఖరీఫ్ మద్దతు ధరలకు రూ. 2.60 లక్షల కోట్లు..
- సెమీ హైస్పీడ్ రైల్వేలైన్‌కు గ్రీన్ సిగ్నల్..
- నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ..
- అభివృద్ధి, మౌలిక వసతులపై కేంద్రం ఫోకస్..
- నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం

వివరాలు 2 లో..



ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ఈరోజు (బుధవారం) ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేంద్రమంత్రులతో ప్రధాని చర్చించారు. ఈ భేటీలో పలు నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగు తున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్లు సమాచారం. అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



## సోనియాగాంధీకి మళ్లీ అస్వస్థత.. ఆసుపత్రికి తరలింపు

**న్యూఢిల్లీ,**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ సోనియాగాంధీ స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో గురుగ్రామ్‌లోని వేదాంత ఆసుపత్రికి ఆమెను తరలించారు. సోనియాగాంధీ ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగా ఉందని ఆసుపత్రి వైద్యులు వెల్లడించారు. ఆమె వెంట కుమార్తె ప్రియాంక, కుమారుడు రాహుల్ గాంధీ ఉన్నారు. ఇటీవల సోనియాగాంధీ తరచూ అస్వస్థతకు గురవుతున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జనవరి, మార్చి మాసాల్లో ఆమె తీవ్ర ఆరోగ్యానికి గురయ్యారు.దీంతో సోనియాను వెంటనే ఢిల్లీలోని సర్ గంగారామ్ ఆసుపత్రికి తరలించారు. కొన్ని రోజులపాటు చికిత్స అనంతరం ఆమెను ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేశారు. మరికొన్ని సమయాల్లో స్వల్ప అస్వస్థతకు గురైతే.. ఆమెకు ఇంటి వద్దే వైద్యులు చికిత్స అందించిన విషయం విదితమే. ప్రస్తుతం సోనియాగాంధీ రాజ్యసభ సభ్యురాలిగా.. పార్టీ పార్లమెంటరీ బోర్డు చైర్ పర్సన్‌గా ఉన్నారు.

## బండి భగీరథ్‌ను తప్పించే అవసరం మాకు లేదు



పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు.

2

## అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అనేది మోదీ భావన: వీహెచ్

మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు(వీహెచ్) విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు.

2





## పోలీసుల విచారణకు హాజరుకాని బండి భగీరథ్

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది.

2

## లుకౌట్ నోటీసులు జారీ చేయాలి



2

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు.

2

## అల్లు అర్జున్‌నే వదల్లేదు బండి భగీరథ్‌ను ఎందుకు వదిలేస్తాం




తప్పు చేస్తే తన కుమారుడిని శిక్షించాలంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తాను అభినందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. తన చిత్తశుద్ధిని నిరూపించుకునే అవకాశం బండి సంజయ్‌కు వచ్చిందన్నారు. బండి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని బండి సంజయ్‌ను డిమాండ్ చేశారు.

2



## బండి భగీరథ్‌పై పోక్సో కేసు.. కేటీఆర్ సంచలన పోస్ట్

2



## హైదరాబాద్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని పూజారెడ్డి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది.

# బలపరీక్షలో నెగ్గిన తమిళనాడు సీఎం విజయ్

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

తమిళనాడు అసెంబ్లీలో సీఎం విజయ్ తన బలాన్ని నిరూపించుకున్నారు. నేడు జరిగిన బలపరీక్షలో 144 మంది ఎమ్మెల్యేలు అధికార టీవీకే పార్టీకి అనుకూలంగా ఓటు వేశారు. మరో 22 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. ఐదుగురు ఎమ్మెల్యేలు తటస్థంగా ఉన్నారు. ఈ సందర్భంగా మూజువాణి ఓటుకు బదులుగా స్పీకర్ సభలో ఒక్కో సభ్యుడి మద్దతు గురించి అడిగి తెలుసుకుని వారి ఓటును నమోదు చేసుకున్నారు. కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎమ్ఎల్ పార్టీల ఎమ్మెల్యేలు టీవీకేకు అనుకూలంగా ఓటు వేశారు. అన్నాడీఎంకేకు చెందిన పలువురు రెబెల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కు మద్దతుగా నిలిచారు. ఇక డీఎంకే ఈ విశ్వాసపరీక్షను బహిష్కరించింది. పార్టీకి చెందిన 59 మంది ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. దీంతో, సభలో సభ్యుల సంఖ్య తగ్గి మ్యాజిక్ మార్కులో కూడా ఆ మేరకు కోత పడింది. ఈ క్రమంలో బలపరీక్షలో సీఎం విజయ్ సులువుగా నెగ్గారు.ఈ సందర్భంగా సీఎం విజయ్ ప్రసంగిస్తూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో అందరికీ సమాన అవకాశాలు ఉంటాయని హామీ ఇచ్చారు. ప్రజలను నమ్ముకునే ఎన్నికల బరిలోకి దిగామని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాలకు తమపై నమ్మకం ఉందని అన్నారు. తమను గెలిపించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇక టీవీకేకు మద్దతిచ్చిన అన్నాడీఎంకే రెబెల్ ఎమ్మెల్యేల తరపున సీనియర్ నేత వేలుమణి మాట్లాడుతూ తాము ఎలాంటి మంత్రి పదవులనూ ఆశించట్లేదని అన్నారు. ప్రలోభాలు చూపించి మద్దతు కూడగట్టాల్సిన అవసరం తమకు లేదని సీఎం విజయ్ ఈ సందర్భంగా బదులిచ్చారు.మరోవైపు, ప్రతిపక్ష డీఎంకే నేత ఉదయనిధి కీలక వ్యాఖ్యలు చేశారు. విజయ్‌ను రాష్ట్రంలో మెజారిటీ ప్రజలు తిరస్కరించారని అన్నారు. విశ్వాసపరీక్ష సందర్భంగా అన్నాడీఎంకే మద్దతును కొనుగోలు చేసినట్టు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. ఇప్పటివరకూ డీఎంకే అమలు చేసిన పథకాలను కొనసాగించాలని కూడా డిమాండ్ చేశారు.

# కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు..

- రైతులు, రైల్వేలు, పరిశ్రమలకు భారీ ఊతం
- ఖరీఫ్ మద్దతు ధరలకు రూ.2.60 లక్షల కోట్లు..
- సెమీ హైస్పీడ్ రైల్వేలైన్‌కు గ్రీన్ సిగ్నల్..
- నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ..
- అభివృద్ధి, మౌలిక వసతులపై కేంద్రం ఫోకస్..
- నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం

ఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ సమావేశం ఈరోజు (బుధవారం) ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై కేంద్రమంత్రులతో ప్రధాని చర్చించారు. ఈ భేటీలో పలు నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఈ సమావేశంలో పశ్చిమాసియా సంక్షోభం, పెరుగు తున్న గ్లోబల్ ఆయిల్ రేట్స్, ఇంధన సంరక్షణ, వర్క్ ఫ్రమ్ హోమ్, ఆన్‌లైన్ క్లాసెస్, బంగారం కొనుగోళ్ల వాయిదాపై చర్చించినట్లు సమాచారం. అలాగే, ఖరీఫ్ సీజన్ మద్దతు ధరల నుంచి కోల్ గ్యాసిఫికేషన్, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయ ఆధునికీకరణ వరకు భారీ కేటాయింపులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

### ఖరీఫ్ మద్దతు ధరలకు రూ.2.60 లక్షల కోట్లు..

దేశవ్యాప్తంగా రైతులకు మద్దతుగా ఖరీఫ్ పంటల కనీస మద్దతు ధరల (మీస్రా) అమలుకు కేంద్ర కేబినెట్ రూ.2,60,000 కోట్ల కేటాయింపునకు ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయం ద్వారా రైతులకు పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు వ్యవసాయ రంగానికి ఆర్థిక భరోసా లభించనుంది.



### పెంచిన ధరలివే..

ఖరీఫ్ పంటలకు మద్దతు ధర పెంపునకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఆయా పంటలకు క్వింటాకు పెంచిన రేట్లు ఇలా ఉన్నాయి.

### కోల్ గ్యాసిఫికేషన్ పథకానికి రూ.37,500 కోట్లు..

దేశంలో బొగ్గు వినియోగాన్ని ఆధునికీకరించేందుకు కోల్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులకు రూ.37,500 కోట్ల కేటాయింపునకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు ద్వారా దిగుమతి ఇంధనాలపై ఆధారాన్ని తగ్గించడంతో పాటు దేశీయ పరిశ్రమలకు మద్దతు లభించనుంది.

### సెమీ హైస్పీడ్ రైల్వేలైన్‌కు గ్రీన్ సిగ్నల్..

గుజరాత్‌లో సర్కేజీ – ధోలేరా మధ్య సెమీ హైస్పీడ్ డబుల్ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు రూ.20,065 కోట్ల వ్యయాన్ని కేటాయించింది. రైల్వే కనెక్టివిటీ మెరుగుపడి పారిశ్రామిక అభివృద్ధికి ఈ ప్రాజెక్టు కీలకంగా మారనుంది.

నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయ ఆధునికీకరణ..

మహారాష్ట్రలోని నాగపూర్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆధునికీకరి ంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కొత్త సదుపాయాలు, విస్తరణ పనులతో విమానాశ్రయ సేవలు మరింత మెరుగుపడనున్నాయి. దీని ద్వారా ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి.

### అభివృద్ధి, మౌలిక వసతులపై కేంద్రం ఫోకస్..

ఈ నిర్ణయాలతో వ్యవసాయం, రైల్వేలు, ఇంధన రంగం, విమానయాన రంగాలకు భారీ ప్రోత్సాహం లభించనుంది. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్టులు కీలక పాత్ర పోషిస్తాయని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.

# పోలీసుల విచారణకు హాజరుకాని బండి భగీరథ్

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్.. పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అయ్యింది. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం ఈ కేసును విచారిస్తోంది. ఇందులో భాగంగా విచారణకు రావాల్సిందిగా భగీరథ్‌కు పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈరోజు మధ్యాహ్నం 2 గంటలకు పోలీసుల ముందు విచారణకు రావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే సమయం గడిచినప్పటికీ భగీరథ్.. పోలీసుల విచారణకు హాజరుకాలేదు.ఈ కేసుకు సంబంధించిన ఎఫ్ఐఆర్‌లో పలు సెక్షన్లను పోలీసులు జోడించారు. దీచీూ 74,75 తో పాటు సెక్షన్ 5 (ఊ) రెడ్ విత్ 6 కింద కేసులు నమోదు చేశారు. బాధితురాలి నుంచి రెండో సారి స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేశారు. తాజాగా నిందితుడిపై తీవ్రమైన లైంగిక దాడి, ముందుగా ప్లాన్ చేసి లైంగిక చర్యలకు పాల్పడినట్లు సెక్షన్ 5 (ఉ)ను కూడా పోలీసులు జతపరిచారు. మరోవైపు ముందస్తు బెయిల్ కోసం తెలంగాణ హైకోర్టులో బండి భగీరథ్ పిటిషన్ వేశారు. రేపు(గురువారం) ఈ పిటిషన్‌పై హైకోర్టు వెకేషన్ బెంచ్ విచారణ చేయనుంది.

# లుకౌట్ నోటీసులు జారీ చేయాలి

## ప్రధాని సభలో బండి సంజయ్.. ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్న కవిత

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు.బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు.బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు– రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు.కులగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# బండి భగీరథ్‌పై పోక్సో కేసు.. కేటీఆర్ సంచలన పోస్ట్

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు అవడం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. భగీరథ్ తనను లైంగికంగా వేధించాడంటూ బాలిక చేసిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీర్‌బాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. బీజేపీ నేతలు మాత్రం ఈ విషయాన్ని రాజకీయ కుట్రగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. భగీరథ్ కేసుపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందిస్తూ.. సోషల్ మీడియా ఎక్స్‌లో సంచలన పోస్ట్ చేశారు. అన్ని విషయాల్లో ఏకరూపత కోరుకునే బీజేపీ.. బంధువుల విషయానికి వస్తే రెండు ప్రమాణాలను పాటిస్తోందంటూ సెటైర్ విసిరారు.

### కేటీఆర్ ట్వీట్..

'ఒక దేశం – ఒక పన్ను.. వన్ నేషన్ – వన్ ఎలక్షన్.. అన్ని విషయాల్లో ఏకరూపత ఉండాలని బీజేపీ కోరుకుంటోంది. కానీ వారి బంధువులను రక్షించే విషయానికి వస్తే.. ఒక పోక్సో చట్టం – కానీ రెండు ప్రమాణాలు. ఒకటి కేంద్ర మంత్రి కొడుకు కోసం, మరొకటి సామాన్యుల కోసం' అంటూ కేటీఆర్ పోస్ట్ చేస్తూ.. చపోక్సో, చబేటీ బచావో అంటూ జతపరిచారు.

# బండి భగీరథ్‌ను తప్పించే అవసరం మాకు లేదు: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

పోక్సో కేసులో ఆరోపణలు రాగానే అరెస్ట్ చేయాలని.. చట్టం ప్రకారం నడుచుకోకపోతే ఇబ్బందులు తప్పవని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను తప్పకుండా అరెస్ట్ చేస్తారని తెలిపారు. బండి సంజయ్ కొడుకు పరారీలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిఖార్సైన కాంగ్రెస్ లీడర్ అని చెప్పుకొచ్చారు. బండి సంజయ్ కుమారుడి కేసులో ఎలాంటి జాప్యం లేదని వెల్లడించారు. పోక్సో చట్టం తెచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. బండి భగీరథ్‌ను తప్పించే అవసరం తమకు లేదన్నారు. భగీరథ్ విదేశాలకు వెళ్లారని అనుకోవడం లేదని అన్నారు.మోదీని ప్రధాన మంత్రిగా మాత్రమే చూస్తామని పీసీసీ చీఫ్ అన్నారు. ప్రధాని మోదీ ఏదో ఇస్తారని అనుకుంటే ఏమీ ఇవ్వలేదని విమర్శించారు. బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు ఉన్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ కంటే బీజేపీలో ఎక్కువ గ్రూపు తగాదాలు ఉన్నాయన్నారు. బండి భగీరథ్ కేసులో బాధితురాలికి న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ వెనుకంజ వేయదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో విజయలక్ష్మికి మహిళా కమిషన్ చైర్మన్ పదవి ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. ఎవరికి వారు తెలంగాణ జాతిపిత అనుకుంటే ఎలా.. జాతిపిత అనే బిరుదు ప్రజలు ఇవ్వాలన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఉద్యమంలో మొదటి నుంచి ఉన్నారని.. కవిత, కేటీఆర్ తర్వాత వచ్చారని తెలిపారు. తెలంగాణలోనూ ా×=తో అక్రమాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. ఎవరి ఓటును వాళ్లు కాపాడుకోవాలని సూచించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌజ్‌కు పరిమితమై వ్యక్తిగత జీవితానికి అలవాటు పడ్డారన్నారు. రాష్ట్రంలో గతం కంటే ఈసారి ఎక్కువగా పంట దిగుబడి వచ్చిందని మహేశ్ అన్నారు. ధాన్యం కొనుగోలు జరుగుతోందని.. ఎలాంటి ఇబ్బంది లేదని తెలిపారు. గత ప్రభుత్వం చేస్తున్న అప్పులు తీర్చుతూనే అభివృద్ధి చేస్తున్నామన్నారు. బెంగాల్‌లో బీజేపీ ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేదని మహేశ్ కుమార్ గౌడ్ వ్యాఖ్యానించారు.

# అల్లు అర్జున్‌నే వదల్లేదు బండి భగీరథ్‌ను ఎందుకు వదిలేస్తాం: కాంగ్రెస్ నేత

హైదరాబాద్,

తప్పు చేస్తే తన కుమారుడిని శిక్షించాలంటూ కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తాను అభినందిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మీడియా కమ్యూనికేషన్ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. తన చిత్తశుద్ధిని నిరూపించుకునే అవకాశం బండి సంజయ్‌కు వచ్చిందన్నారు. బుధవారం గాంధీ భవన్‌లో సామ రామ్మోహన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులకు అప్పగించాలని బండి సంజయ్‌ను డిమాండ్ చేశారు.టాలీవుడ్ హీరో అల్లు అర్జున్‌నే వదలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం బండి సంజయ్



కుమారుడిని ఎందుకు వదిలేస్తుందని ప్రతిపక్షాలను సూటిగా ప్రశ్నించారు. బండి సంజయ్ విషయంలో బీజేపీ నేతలకు, బీఆర్ఎస్ నాయకులు సహకరిస్తున్నారని విమర్శించారు. తనకున్న అధికారంతో ఈ కేసును బండి సంజయ్ తారుమారు చేసే అవకాశముందని సందేహం వ్యక్తం చేశారు.బండి సంజయ్ తన పదవికి రాజీనామా చేసి.. ఈ కేసు విచారణకు సహకరించాలని సామ డిమాండ్ చేశారు. బండి సంజయ్‌కి సొంత పార్టీలోనే వ్యతిరేక వర్గం ఎక్కువైందన్నారు. తప్పు చేసిన వారిని వదిలే సమస్యనే లేదన్నారు. తప్పు చేయనప్పుడు విచారణ ఎదుర్కొనేందుకు భయం ఎందుకు? అంటూ బండి సంజయ్‌ను సామ రామ్మోహన్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు.

# అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అనేది మోదీ భావన: వీహెచ్

హైదరాబాద్,

మోదీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని ప్రభుత్వ సలహాదారు వీ.హనుమంతరావు(వీహెచ్) విమర్శలు గుప్పించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అపోజిషన్ లీడర్ అంటే రబ్బర్ స్టాంప్ అని మోదీ భావిస్తున్నారని మండిపడ్డారు. సీబీఐ డైరెక్టర్ అపాయింట్మెంట్ విషయంలో అపోజిషన్ లీడర్ అభిప్రాయాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రతిపక్ష నేత అభిప్రాయం తీసుకోకపోవడంతో రాహుల్ గాంధీ లేఖ రాసినట్లు చెప్పారు. ప్రధానికి రాహుల్ లేఖ రాయడాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు.మోదీకి అనుకూలంగా ఉన్న వాళ్లను సీబీఐ డైరెక్టర్‌గా నియమిస్తారా అని వీహెచ్ ప్రశ్నించారు. భజన చేసే వాళ్లకే మోదీ.. పదవులు ఇస్తున్నారని ఆరోపించారు. రాహుల్ పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు వీహెచ్ తెలిపారు. అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని బీజేపీ అవమానిస్తోందని మండిపడ్డారు. జనగణనలో బీసీ కాలమ్ లేకపోవడం అన్యాయమన్నారు. ఆర్ఎస్ఎస్ చేతిలో నరేంద్ర మోదీ కీలు బొమ్మగా మారారని దుయ్యబట్టారు. 'సబ్ కా సాథ్.. సబ్ కా వికాస్' అబద్ధమని... బీజేపీ వికాసం మాత్రమే జరుగుతోందని వీహెచ్ వ్యాఖ్యానించారు.

# హైదరాబాద్‌లో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

హైదరాబాద్,

మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ విద్యార్థిని పూజారెడ్డి ఆత్మహత్య తీవ్ర కలకలం రేపుతోంది. కాలేజీ హాస్టల్‌లో విద్యార్థిని ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. కోదాడకు చెందిన పూజారెడ్డి.. మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్ చదువుతోంది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని.. బెటర్మెంట్ కోసం పరీక్షకు అప్లై చేసుకుంది. నేటి(బుధవారం) నుంచి ఇంటర్ బెటర్మెంట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా రాత్రి హాస్టల్‌లో విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.తోటి విద్యార్థుల గమనించి వెంటనే హాస్టల్ వార్డెన్‌కు తెలియజేశారు. విద్యార్థిని ఆత్మహత్యపై హాస్టల్ సిబ్బంది.. పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న పోలీసులు.. విద్యార్థిని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షల ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆత్మహత్యపై కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న తమ బిడ్డ ఇలా ఆత్మహత్య చేసుకోవడంపై తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# తాలు.. కటింగ్‌లపై పోలీస్ కొరడా

### ధాన్యం కొనుగోళ్లలో రైతుల మోసాలకు చెక్ :మిల్లుల వద్ద కానిస్టేబుళ్ల నియామకం

### జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్








**నల్లగొండ,అన్వేషనేత్రం ప్రతినిధి,మే 13:**

రబీ ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.బుధవారం మిర్యాలగూడ పరిధిలోని వసుంధర, ఆర్ఎస్‌వీ, అనంతసాయి, పారాబాయిల్డ్ రైస్ మిల్లులను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిస్థితిని సమీక్షించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని రైస్ మిల్లర్లు మొదటి ప్రాధాన్యతతో అన్‌లోడ్ చేయాలని ఆదేశించారు. మిల్ పాయింట్‌కు వచ్చిన ప్రతి లారీని 12 గంటల లోపు ఖాళీ చేసి తిరిగి కొనుగోలు కేంద్రాలకు పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ధాన్యం అన్‌లోడింగ్‌లో జాప్యం, నిర్లక్ష్యం లేదా రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి మిల్ పాయింట్ వద్ద ఒక పోలీస్ కానిస్టేబుల్‌ను నియమించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, మధ్యవర్తులు రైతులను మోసం చేస్తున్నట్లు పోలీస్ శాఖ దృష్టికి వచ్చినట్లు ఎస్పీ పేర్కొన్నారు. "తాలు" పేరుతో ఒక్కో బస్తాకు రెండు నుంచి మూడు కిలోల వరకు అధిక తూకం వేయడం, మిల్లుల వద్ద బస్తా కొద్దీ కటింగ్‌లు పెట్టడం, నాణ్యత పేరుతో రైతులపై ఒత్తిడి తేవడం వంటి అక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు.'ఏ గ్రేడ్' ధాన్యంగా నిర్ధారించి మిల్లులకు పంపిన తర్వాత 'బీ గ్రేడ్'గా చూపిస్తూ క్వింటాల్‌కు రూ.20 వరకు తగ్గించి చెల్లింపులు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. అలాగే కొంతమంది లారీ యజమానులు, హమాలీలు బస్తాకు అదనంగా రూ.2 చెల్లిస్తేనే లోడింగ్ చేస్తామని రైతులను వేధిస్తున్నట్లు వెల్లడించారు. రైతుల నుంచి బలవంతపు వసూళ్లు చేయడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పాల్గొనే అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు, రవాణాదారులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రైతుల నుంచి అక్రమ వసూళ్లు, అధిక తూకాలు, కటింగ్‌లు లేదా చెల్లింపుల్లో మోసాలు జరిగితే సంబంధిత వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ప్రభుత్వ ధాన్యానికి ప్రాధాన్యత ఇవ్వకుండా ప్రైవేట్ ధాన్యాన్ని ముందుగా అన్‌లోడ్ చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. రానున్న పది రోజుల పాటు జిల్లాలో ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా ధాన్యం రాకుండా చెక్‌పోస్టుల వద్ద పర్యవేక్షణను కట్టుదిట్టం చేసినట్లు తెలిపారు.ధాన్యం కొనుగోళ్లలో ఎవరైనా అక్రమాలు, అదనపు వసూళ్లు, బెదిరింపులకు పాల్పడితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖలతో సమన్వయం చేసుకుంటూ కొనుగోలు ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ తనిఖీల్లో మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజు, ఎస్‌బీ సీఐ ఆదిరెడ్డి, రూరల్ సీఐ పి.ఎన్.డి ప్రసాద్, రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు ఏఆర్ఎస్ఐలకు ఆర్ఎస్ఐలుగా పదోన్నతి

### ఎస్పీ శరత్ చంద్ర పవార్,ఐపీఎస్

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 13:**



నల్లగొండ జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ (ఏఆర్) విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఏఆర్ఎస్ఐలు హతిరామ్, వెంకటరాములు రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా (ఆర్ఎస్ఐ) పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా వారు జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు స్వీకరించారు. పదోన్నతి పొందిన అధికారులకు ఎస్పీ స్టార్‌లు అందజేసి అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖలో పదోన్నతులు కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా బాధ్యతలను కూడా మరింత పెంచుతాయని పేర్కొన్నారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ చట్ట పరిరక్షణలో న్యాయబద్ధంగా, పారదర్శకంగా వ్యవహరించాలని అధికారులకు సూచించిన ఎస్పీ.. శాఖ ప్రతిష్టను మరింత పెంచే విధంగా సేవలు అందించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని పదోన్నతి పొందిన అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి కృషి చేస్తామని పదోన్నతి పొందిన అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐ సంతోష్‌తో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పోక్సో కేసులో బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

### మంత్రి పదవికి బండి సంజయ్ రాజీనామా చేయాలంటూ

### ఎస్ఎఫ్ఐ,డీవైఎఫ్ఐ,ఐద్వా నేతల డిమాండ్

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 13:**

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాలని ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, ఐద్వా జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు బుధవారం సుభాష్ విగ్రహం వద్ద బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం




చేశారు.ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్ మాట్లాడుతూ.. మైనర్ బాలిక తల్లి ఫిర్యాదు చేసినప్పటికీ ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి అయిన బండి సంజయ్ తన అధికార ప్రభావంతో తన కుమారుడిని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు.పోక్సో కేసు నమోదైనా బీజేపీ నాయకత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. మహిళల భద్రతను తాకట్టు పెట్టే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తన కుమారుడిపై తీవ్రమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో బండి సంజయ్ నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.మైనర్ బాలిక కుటుంబానికి భద్రత కల్పించాలని, కేసుపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. బండి భగీరథ్‌పై గతంలో ర్యాగింగ్, డ్రగ్స్‌కు సంబంధించిన ఆరోపణలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమైన విషయాన్ని గుర్తుచేశారు. బాధిత కుటుంబానికి బెదిరింపులు వస్తున్నాయని, వెంటనే రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. లేదంటే డీజీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు తుమ్మల పద్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కట్టె లింగస్వామి, ఎస్ఎఫ్ఐ నల్లగొండ డివిజన్ కార్యదర్శి మారుపాక కిరణ్, నవదీప్, స్పందన, శిరీష, కావ్య, కల్పన, రాధిక, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# సేవే నా ధ్యేయం --- ప్రజల ఆశీస్సులే నా బలం

సమాజానికి ఉపయోగపడే ప్రతి చిన్న పని కూడా నా బాధ్యతగా భావిస్తూ, ఎంతోమంది సీనియర్ సిటిజన్లు, పేద కుటుంబాలు, మహిళలు, వృద్ధులు మరియు చిన్నారుల కోసం నా వంతు సేవ చేయడం నాకు ఒక అదృష్టంగా భావిస్తున్నాను. పిల్లల స్కూల్ ఫీజుల సమస్యల నుండి హాస్పిటల్ ఖర్చుల వరకు, రేషన్ కార్డుల సమస్యల నుండి అవసరమైన ప్రభుత్వ సహాయాల వరకు ప్రజల కష్టాల్లో తోడుగా నిలవాలని ఎప్పుడూ ప్రయత్నించాను.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి గౌరవనీయులు రేవంత్ రెడ్డీ అన్నగారి ప్రజాపాలన, ప్రజా ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం రావడం నిజంగా నా అదృష్టంగా భావిస్తున్నాను. ప్రజలకు ఉపయోగపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ చేరేలా చేయడం నా బాధ్యతగా భావిస్తూ ముందుకు సాగుతున్నాను.ఈ ప్రయాణంలో నేను చేసిన చిన్న చిన్న సేవలను గుర్తించి,





గౌరవనీయులు ఉదయ్ కుమార్ నాయుడు తాతయ్యగారు నన్ను అభినందించడం నాకు ఎంతో భావోద్వేగాన్నిచ్చింది. నిన్న వారు కవిత్వ రూపంలో నా కృషిని కొనియాడటం నిజంగా నా జీవితంలో మరచిపోలేని క్షణంగా నిలిచిపోతుంది. వారి ప్రేమ, ఆదరణ, ఆశీస్సులు నాకు మరింత బాధ్యతను గుర్తు చేశాయి. వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను.అలాగే, మా సేవా కార్యక్రమాలను గుర్తిస్తూ ఎప్పటికప్పుడు మమ్మల్ని ప్రోత్సహిస్తున్న ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా ప్రత్యేక కృతజ్ఞతలు. మీ ఆశీస్సులు, మీ ప్రోత్సాహమే మాకు మరింత ఉత్సాహాన్ని ఇస్తున్నాయి.

ఈ కార్యక్రమాల్లో నేను ముందడుగు వేయడంలో సహాయ సహకారాలు అందించిన కాంగ్రెస్ పార్టీ పెద్దలు గురువులు టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ బండి రమేష్ గారికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఉద్యోగులకు, నా మిత్రబృందానికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం...

ప్రజల ఆశీస్సులే నా ప్రేరణ...

మీ అందరి ప్రేమాభిమానాలతో మరింత సేవ చేయడానికి నేను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాను.ధన్యవాదాలు.

మీ గాదె శివ జూ,వీదూ
బండి రమేష్ అన్న సేన
శివ యువగళం
రేవంత్ అన్న ఫాలోయర్స్



# లెప్రసి కాలనీ క్రాసింగ్ పునఃప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్:

### పాతపల్లె రోడ్డు వద్ద స్పీడ్ బ్రేకర్లకు హైవే అధికారుల హామీ

### స్థానిక కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి--అశోక్ చంద్ర






**నల్లగొండ,అన్వేషనేత్రంప్రతినిధి,మే 13:**

నల్లగొండ నగరపాలక సంస్థ 3వ డివిజన్ పరిధిలోని ఎస్‌హెచ్--62 అద్దంకి బైపాస్ వద్ద లెప్రసి కాలనీ క్రాసింగ్‌ను పునఃప్రారంభించేందుకు హైవే నిర్మాణ సంస్థ అధికారులు సానుకూలంగా స్పందించారు. స్థానిక కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి--అశోక్ చంద్ర సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. పానగల్లు బైపాస్ నుంచి మిర్యాలగూడ వైపునకు వెళ్లే బైపాస్ రోడ్డుపై ఉన్న లెప్రసి కాలనీ, రిక్షాపుల్లర్స్ కాలనీల్లో సుమారు 200 కుటుంబాలు నివసిస్తున్నాయి. కాలనీవాసుల రాకపోకల కోసం గతంలో రోడ్డు క్రాసింగ్ ఏర్పాటు చేసినప్పటికీ సిగ్నల్ సౌకర్యం లేకపోవడంతో రెండు సంవత్సరాల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. అనంతరం ఆ క్రాసింగ్‌ను అధికారులు మూసివేశారు. ఈ సమస్యపై కార్పొరేటర్ పేర్ల మల్లీశ్వరి గత మార్చి 24న హైదరాబాద్‌లోని ఆర్అండ్‌బీ ఈఎన్‌సీకి వినతిపత్రం సమర్పించారు. దానిపై స్పందించిన హైవే నిర్మాణ సంస్థ ప్రతినిధులు బుధవారం పరిశీలన నిర్వహించి, త్వరలో లెప్రసి కాలనీ క్రాసింగ్‌ను రీ ఓపెన్ చేస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా పాతపల్లె క్రాసింగ్ వద్ద నుంచి పాతపల్లి, శేషమ్మగూడెం, తానేదార్‌పల్లి, అల్లిగూడెం, కాజీరామారం గ్రామాలకు పెద్దఎత్తున ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు వివరించారు. అక్కడ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాలు నెమ్మదిగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై కూడా త్వరలో చర్యలు చేపడతామని హైవే అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గుండుకోటయ్య, పోకల అంజయ్య, వలశెట్టి మార్కొండయ్య, గాలి మురళి, కొత్తపల్లి మల్లేశ్, కొప్పు శ్రీను, పేర్ల చలమంద, సంతు నాని, స్వామి పాల్గొన్నారు.

# తిరుపతమ్మ గోపయ్య అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలి

### కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి,వార్డ్ మెంబర్ కోల నాగరాణి



**వేములపల్లి,అన్వేషనేత్రం మే 13:**

గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ పత్తిపాటి స్వరాజ్యలక్ష్మి,ఆమనగల్లు కాంగ్రెస్ పార్టీ వార్డ్ నెంబర్ కోల నాగరాణి అన్నారు.నల్గొండ జిల్లా వేములపల్లి మండల పరిధిలోని ఆమనగల్లు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుపతమ్మ గోపయ్య,అంకమ్మ తల్లి, నాగులమ్మ తల్లి దేవాలయాల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ట మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ దేవతల ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల ప్రజల్లో భక్తి భావం పెంపొందడంతో పాటు సామాజిక ఐక్యత మరింత బలపడుతుందని పేర్కొన్నారు.తిరుపతమ్మ గోపయ్య అమ్మవారి కృప ప్రజలందరిపై ఉండాలని ప్రజలు సంప్రదాయాలను పరిరక్షిస్తూ భక్తిశ్రద్ధలతో దేవతలను ఆరాధించాలని సూచించారు.

# నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రత్యేక దృష్టి:

### సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌కు ప్రాధాన్యం

### కమిషనర్ బి. శరత్ చంద్ర

**నల్లగొండ,అన్వేషనేత్రం,మే 13:**

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ర్యాంకు సాధించేందుకు సిటిజన్ ఫీడ్‌బ్యాక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి. శరత్ చంద్ర సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహించనున్న ఇండీ పప్పీ అడాప్షన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశానికి సెక్షన్ హెడ్‌లు,వార్డు అధికారులు, టీఎంసీలు,కమ్యూనిటీ ఆర్గనైజర్లు, మేప్మా రిసోర్స్ పర్సన్స్, శానిటరీ సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నగరానికి మంచి ర్యాంకు సాధించాలంటే ప్రతి విభాగం సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛ సర్వేక్షణ్ యాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ నమోదు చేయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పట్టణంలోని అన్ని డివిజన్లలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడంతో పాటు ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సూచించారు. నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. అదేవిధంగా "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల కార్యాచరణ"లో భాగంగా నిర్వహించనున్న ఇండీ పప్పీ అడాప్షన్ ప్రోగ్రామ్‌పై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ప్రతి వార్డులో ఉన్న ఇండీ పప్పీల వివరాలను గుర్తించి నమోదు చేయాలని, ఈ ప్రక్రియను ఆదివారం నాటికి పూర్తి చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాబోయే వారంలో ఇండీ పప్పీ అడాప్షన్ న్ని ఘనంగా



నిర్వహించనున్నట్లు తెలిపారు. దత్తత తీసుకునే వారికి అడాప్షన్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. జంతు సంరక్షణలో భాగంగా ప్రతి కుటుంబం ఈ కార్యక్రమంలో పాల్గొని ఇండీ పప్పీలను దత్తత తీసుకోవాలని కమిషనర్ పిలుపునిచ్చారు. కార్యక్రమం విజయవంతం కోసం వెటర్నరీ, పశుసంవర్ధక శాఖతో సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లు చేయాలని ఆయన సూచించారు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోర్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# కమల నాథులకు తగునా ఇది!

పశ్చిమబెంగాల్ రాజకీయాలను నిశితంగా గమనిస్తున్నవారికి కమలనాథుల గెలుపు అంతగా ఆశ్చర్యం కలిగించి ఉండదు. మూడు దఫాలుగా అధికారాన్ని నిరాఘాటంగా కొనసాగించిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీపట్ల సహజంగానే ప్రజలలో ఏర్పడిన వ్యతిరేకత, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఒంటెత్తు పోకడలు, స్వయంకృతాపరాధాలు, రాష్ట్రంలో కొరవడిన శాంతిభద్రతలు వంటి లోటుపాట్లను తనకు అనుకూలంగా మలచుకోవడంలో భారతీయ జనతా పార్టీ నూటికి నూరుపాళ్లూ విజయం సాధించింది. ఒక్కమాటలో చెప్పాలంటే తృణమూల్ లోపాలే బిజెపి గెలుపునకు బాటలు వేశాయంటే అతిశయోక్తి కాదు.



భారీ మెజారిటీతో అధికారంలోకి వచ్చిన బిజెపి వచ్చీరాగానే ప్రజల మన్ననలను చూరగొనేందుకు, రాష్ట్రంలో అదుపు తప్పిన శాంతిభద్రతలను తిరిగి పట్టాలు ఎక్కించేందుకు శ్రీకారం చుడితే బాగుండేది.

కానీ తొలి మంత్రివర్గంలో తీసుకున్న నిర్ణయాలను బట్టి చూస్తే, కమలనాథులకు స్వీయ ఎజెండా అమలే అన్నింటికన్నా ముఖ్యమైనదిగా తోస్తున్నది. బంగ్లాదేశ్ సరిహద్దులలో కంచె నిర్మాణానికి సరిహద్దు భద్రతా దళానికి భూమిని అప్పగించడం, ఆయుష్మాన్ భారత్ సహా ప్రధాన కేంద్ర పథకాలను పశ్చిమ బెంగాల్ లోనూ అమలు చేయడం, ప్రభుత్వ ఉద్యోగాలకు గరిష్ట వయోపరిమితిని ఐదేళ్లకు పెంచడం, కేంద్రం ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలోనూ జనగణన జరిపించడం, రాజకీయ ప్రేరేపిత హింస కారణంగా మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు న్యాయపరంగా అండదండలు అందించడం, రాష్ట్ర ఐఎఎస్, ఐపిఎస్ తదితర క్యాడర్ అధికారులకు కేంద్ర ప్రభుత్వ శిక్షణా కార్యక్రమాలలో పాల్గొనే వెసులుబాటు కల్పించడం.. ఇవీ సువేందు తొలి మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు. పార్టీకోసం ప్రాణాలు అర్పించిన 321 మంది అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటామని స్వయంగా ముఖ్యమంత్రి సువేందు ప్రకటించడం విడ్డూరం. రాజకీయ హింసలో కేవలం బిజెపి కార్యకర్తలే అసువులు బాసారా, తృణమూల్ కార్యకర్తలు లేరా? రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వారి కుటుంబాలను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? శాంతిభద్రతలను గాడిన పెట్టే దిశగా తొలి మంత్రివర్గంలో ఏ ఒక్క నిర్ణయమూ లేకపోవడం ఒకింత ఆశ్చర్యం కలిగించే విషయమే. తృణమూల్ హయాంలో బంగ్లాదేశ్ నుంచి చొరబాట్లు పెరిగిపోయాయన్న మాట వాస్తవమే కావచ్చు. కానీ కొంపలేవో మునిగిపోతున్నట్లు కంచె నిర్మాణంపై అధికారంలోకి వచ్చీరాగానే నిర్ణయం తీసుకోవలసిన అవసరం ఏముంది? వాస్తవానికి బంగ్లాదేశ్- బెంగాల్ మధ్య నాలుగు వేల కిలోమీటర్ల పొడవునా సరిహద్దు ఉంటే, మూడువేల కిలోమీటర్లకు పైగా కంచె నిర్మాణం ఇప్పటికే పూర్తయింది. ఇక మిగిలిన సుమారు 800 కి.మీ మేర మాత్రమే కంచె నిర్మించవలసి ఉంది. ఈ కొద్దిమేర కంచె నిర్మాణం ముందుకు సాగకపోవడానికి గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమనడంలోనూ సందేహం లేదు. అయితే అసలు సమస్యలను పక్కనబెట్టి, ఎన్నికల్లో హామీ ఇచ్చాం కదా అని వాటి అమలుకే నడుం బిగించడం సమంజసం అనిపించుకోదు. బెంగాల్లో అధికారాన్ని హస్తగతం చేసుకోవాలన్న పట్టుదలతో కమలనాథులు ఎన్నికలకు ముందునుంచే వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, తృణమూల్‌ను ఎక్కడికక్కడ నిలువరిస్తూ వచ్చారు. ఐప్యాక్‌పై ఇడితో దాడులు జరిపించడం, టిఎంసికి అనుకూలురైన అధికారులను బదిలీ చేయించడం, కనీవినీ ఎరుగని రీతిలో కేంద్ర బలగాలను మోహరించడం వంటివి ఈ కోవలోకే వస్తాయి. అయితే అధికారాన్ని చేజిక్కించుకున్నాక జనరంజకమైన పాలన అందించడం ద్వారా తమపై ప్రజలు పెట్టుకున్న ఆశలు వమ్ముకాకుండా చూసుకోవాలి. కానీ అధికార పార్టీ ఆ దిశగా ఆలోచిస్తున్నట్లు కనిపించడం లేదు. మొట్టమొదటిసారి బెంగాల్‌లో పాగా వేశామన్న సంతోషంలో కమలనాథులు రాష్ట్రంలో ఏం జరుగుతోందో చూసే స్థితిలో లేరు. ఫలితాలు వెల్లడైన రోజునుంచే తృణమూల్ పార్టీ కార్యాలయాలపైనా, కార్యకర్తలపైనా దాడులు మొదలయ్యాయి. పార్టీ కార్యాలయాలను కొన్నిచోట్ల ధ్వంసం చేస్తే, మరికొన్నింటికి కాషాయ రంగు పులిమి స్వాధీనం చేసుకున్నారు. ఇక తమ అమ్ములపొదిలో ప్రధాన అస్త్రమైన ఇడి, సిబిఐ వంటివాటినీ వెలికి తీస్తున్నారు. ముఖ్యమంత్రి సువేందుకు మొన్నటివరకూ పిఎగా పనిచేసిన చంద్రనాథ్ హత్య కేసును సిబిఐకి అప్పగించారు. ఉద్యోగ ఖాళీల భర్తీలో అవినీతికి పాల్పడ్డారనే అభియోగాలపై తృణమూల్‌కు చెందిన మాజీ మంత్రి సుజిత్ బోస్‌పై ఇడిని ప్రయోగించి, అరెస్టు చేయించారు. ఇవన్నీ చూస్తే ప్రతీకార చర్యలకు బిజెపి తెర తీసిందని అనిపించదా? మమతా బెనర్జీ నియంత పోకడలను భరించలేకే ప్రజలు తమకు పట్టంగట్టారన్న వాస్తవాన్ని విస్మరించి, తాము కూడా అదే బాటలో నడిస్తే, ఇవాళ గెలిపించిన ప్రజలే రేపు కర్రు కాల్చి వాతబెడతారు. తస్మాత్ జాగ్రత్త!

# ఫుడ్ డెలివరీ సంస్థలపై హొటల్ యజమానుల ఉద్యమం

చెన్నై : తమిళనాడులోని హొటళ్ల యజమానులు ఆహార డెలివరీ సంస్థలపై తిరుగుబాటు మొదలుపెట్టారు. పెద్ద కంపెనీ డెలివరీ యాప్‌లకు స్వస్తి పలుకుతున్నారు. రాష్ట్రంలో ఇది ఉద్యమంగా మొదలైందని, రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాపితమవుతుందని హొటల్ యజమానుల సంఘాలు ప్రకటిస్తున్నాయి. నామక్కల్ జిల్లాలో మొదలైన ఈ విప్లవం ఇప్పుడు కడలూరు జిల్లాకు వ్యాపించింది. మరిన్ని జిల్లాల్లోని హొటల్ యజమానుల సంఘాలు ఈ విషయమై చర్చలు నిర్వహిస్తున్నాయి.

మా మనుగడకు ఇబ్బంది : హొటల్ యాజమాన్యాలు

జొమాటో, స్విగ్గీ లాంటి ఫుడ్ డెలివరీ యాప్‌లు భారీ మొత్తంలో కమిషన్లు తీసుకుంటాయని హొటల్ యజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. తమ ప్రమేయం లేకుండా ఏకపక్షంగా డిస్కౌంట్లు ఇస్తూ తమ మనుగడకు ఇబ్బందిగా మారుతున్నారని చెబుతున్నాయి. వారి సొంత చూసుకుంటూ హొటళ్ల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, చాలాసార్లు ఫిర్యాదులు చేసినా స్పందన రావడంలేదని వాపోయాయి. పెద్ద డెలివరీ యాప్‌లు 30-35 శాతం కమిషన్లతో పాటు జీఎస్టీలను తమ నుంచి వసూలు చేస్తున్నట్లు ఆవేదన వ్యక్తం చేశాయి. నగరాలతో పోల్చితే ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో నైపుణ్యమైన వంట మాస్టర్లున్నారని, యజమానులున్నారని సంఘ సభ్యులు చెబుతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం లేకపోవడంతో పెద్ద డెలివరీ సంస్థల ఒప్పంద పత్రాల్ని చదవకుండానే సంతకాలు చేసేశారని ఆరోపిస్తున్నారు. ఫలితంగా చాలాచోట్ల హొటళ్లు నష్టాలతో నడుస్తూ తప్పనిసరి పరిస్థితుల్లో ఆ డెలివరీ యాప్‌లను బహిష్కరిస్తున్నట్లు వివరించారు.

జారోజ్ వైపు ఆసక్తి

కడలూరు జిల్లా చిదంబరంవాసి రామ్‌ప్రసాద్ రూపొందించిన 'జారోజ్' యాప్ మీద ఇప్పుడు హొటల్ యజమానుల సంఘాలు ఆసక్తి చూపిస్తున్నాయి. నెలకు పెద్ద రెస్టారెంట్లకు రూ.3 వేలు, చిన్న రెస్టారెంట్లకు, బేకరీలకు రూ.1500, దీనికి అదనంగా జీఎస్టీతో వచ్చిన స్థానిక యాప్‌ను వారు ఎంచుకున్నారు. దీంతో గత కొన్ని నెలలుగా 50 ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో 5 వేల హొటళ్ల నుంచి 8 లక్షల మందికి సేవలందిస్తోంది.

ఈ ఉద్యమం మొదట కేరళలో మొదలైంది..

హొటల్ యజమాన్యాలు పెద్ద డెలివరీ యాప్‌లను బహిష్కరించడం ఇదేం తొలిసారి కాదు. కేరళలో ఈ ఉద్యమం మొదలైంది. 2021లో భారీ కమిషన్లను వ్యతిరేకిస్తూ కొచ్చిలోని కొన్ని హొటళ్లు సొంతంగా యాప్‌లను రూపొందించుకున్నాయి. తర్వాత కేరళ హొటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ స్వతహాగా 'రీజోరు' పేరుతో డెలివరీ యాప్‌ను తీసుకొచ్చింది.

### ధరలు తగ్గిస్తున్నాం

ధరలు తగ్గిస్తున్నాం అని నామక్కల్‌లో జారోజ్ యాప్ ప్రారంభ కార్యక్రమంలో స్థానిక హొటల్ యజమానుల సంఘాల సభ్యులు వెల్లడించారు. కమిషన్ కింద రూ.2 నుంచి రూ.30 వేలు పెద్ద డెలివరీ యాప్‌లకు చెల్లించేవాళ్లమని తెలిపారు. ఇప్పుడు 90 శాతం ఆదా అయ్యే మార్గాన్ని ఎంచుకున్నాం అని చెప్పారు. ఆహార ధరలు కూడా తగ్గిస్తున్నామన్నారు. ఇది హొటల్ యజమానులకు, వినియోగదారులకు లాభదాయకంగా ఉందని, అందుకే పెద్ద యాప్‌లను బహిష్కరించాం అని హొటల్ యజమానుల సంఘాల సభ్యులు వివరించారు.

### ఈ ఉద్యమం రాష్ట్ర వ్యాప్తమవుతుంది

ఈ ఉద్యమం రెండు జిల్లాలకే ఆగిపోవడంలేదనీ, రాష్ట్రవ్యాప్తంగా చాలా జిల్లాల్లో చర్చలు నడుస్తున్నాయని, త్వరలో కీలక నిర్ణయం వెలువడుతుంది అని అరుళ్ మురుగన్, కార్యదర్శి, నామక్కల్ హొటల్ యజమానుల సంఘం వెల్లడించింది. హొటల్ యజమానులకు, వినియోగదారులకు నష్టం కలిగించే యాప్‌ల చర్యలను తాము వ్యతిరేకిస్తున్నామని వెంకట సుబ్బు, అధ్యక్షులు, కడలూరు జిల్లా హొటల్ యజమానుల సంఘం స్పష్టం చేసింది.

# దేశవ్యాప్తంగా ఎపిలోనే అత్యధిక పెట్రోల్ ధర ..!

అమరావతి :

దేశంలోని పలు రాష్ట్రాల్లో సోమవారంనాటి పెట్రోల్ ధరలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో లీటరు పెట్రోల్ రూ.109.46 గా నమోదైంది. ఇది దేశంలోనే అత్యధిక ధర కావడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం క్రూడాయిల్ కొనుగోళ్లు ఒకే విధంగా ఉన్నప్పటికీ రాష్ట్రాలవారీగా వీటి ధరల్లో ఇంత వ్యత్యాసం ఉండటంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ అధిక ధరలకు ప్రధాన కారణాలుగా ఉన్న పెట్రోల్, డీజిల్ పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధిస్తున్న పన్నుల స్వరూపం..!

## రాష్ట్రాల వారీగా ధరల్లో వ్యత్యాసానికి కారణాలు

ముడి చమురు కొనుగోలు ధర అంతర్జాతీయ మార్కెట్ పై, డాలర్‌తో రూపాయి మారకం విలువపై ఆధారపడి ఉన్నప్పటికీ తుది వినియోగదారునికి చేరే పెట్రోల్ ధర రాష్ట్రాలవారీగా గణనీయంగా మారుతోంది. పెట్రోల్, డీజిల్‌ను వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) పరిధి నుంచి మినహాయించారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఆదాయాన్ని పెంచుకోవడానికి ఇంధనంపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను విధిస్తున్నాయి. ఈ వ్యాట్ ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు అధిక వ్యాట్ విధించడం వల్ల ఇక్కడ పెట్రోల్ ధర దేశంలోనే అత్యధికంగా ఉంది. తెలంగాణ, కేరళ, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కూడా వ్యాట్ అధికంగా ఉండటం వల్ల పెట్రోల్ ధరలు భగ్గుమంటున్నాయి.

## కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినా

కేంద్ర ప్రభుత్వం గతంలో పెట్రోల్, డీజిల్ పై ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి కొన్ని రాష్ట్రాలు తమ రాష్ట్ర వ్యాట్‌ను తగ్గించలేదు. దీని ఫలితంగా కేంద్రం ఇచ్చిన తగ్గింపు ప్రయోజనం వాహనదారులకు పూర్తి స్థాయిలో అందడం లేదు. చమురు రిఫైనరీల నుంచి పెట్రోల్, డీజిల్ రవాణా చేసే దూరాన్ని బట్టి ఖర్చులు కూడా ధరను ప్రభావితం చేస్తాయి. అయినప్పటికీ ప్రధాన వ్యత్యాసానికి కారణం రాష్ట్రాల పన్ను విధానాలేనని తెలుస్తుంది. డీలర్ల కమిషన్ కూడా తుది ధరలో భాగమే. ఇది రిఫైనరీల నుంచి డీలర్లకు ఇంధనాన్ని సరఫరా చేసినందుకుగాను చమురు కంపెనీలు చెల్లిస్తాయి.

## పన్నుల స్వరూపం

పెట్రోల్ తుది ధరలో దాదాపు 50 శాతం నుంచి 60 శాతం వరకు పన్నుల రూపంలోనే ఉంటుంది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పన్నులు ఉంటాయి.

కేంద్ర ప్రభుత్వం విధించే పన్నులు

కేంద్ర ప్రభుత్వం లీటరు పెట్రోల్ పై ఒక నిర్ణీత మొత్తం (ఫిక్స్‌డ్ అమౌంట్) లో ఎక్సైజ్ సుంకాన్ని విధిస్తుంది. ఈ మొత్తాన్ని కేంద్రం తన ఖజానాకు జమ చేసుకుంటుంది. సెస్, స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ పేరుతో కూడా కేంద్రం పన్నులను విధిస్తుంది. వీటిలో చాలా వరకు రాష్ట్రాలతో పంచుకోకుండా కేంద్రమే తీసుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం విధించే పన్నులు

రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్ పై విలువ ఆధారిత పన్ను (వ్యాట్) ను విధిస్తున్నాయి. ముఖ్యంగా ఇది డీలర్లకు అమ్మే ధర, కేంద్రం విధించే ఎక్సైజ్ సుంకం, డీలర్ కమిషన్‌తో సహా మొత్తం ధరపై విధిస్తారు. దీని కారణంగా ఇంధనం బేస్ ధర పెరిగితే, రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కూడా పెరుగుతుంది.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోర్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# ఇండియా, చైనా మధ్య ఇండిగో డైరెక్ట్ విమానాలు

### నవంబర్ 10 నుంచి ప్రారంభం




న్యూఢిల్లీ :

ఇండియా, చైనా మధ్య డైరెక్ట్ విమాన సేవలను ప్రారంభించనున్నట్లు ఇండిగో వెల్లడించింది. నవంబర్ 10 నుంచి ఢిల్లీ, గ్వాంగ్‌జౌ మధ్య రోజువారి విమాన సేవలను అందుబాటులోకి తెస్తోన్నట్లు పేర్కొంది. ఇందుకోసం ఎయిర్‌బస్ ఎ320 విమానాలను ఉపయోగించనున్నట్లు వెల్లడించింది. కరోనా, ఆ తర్వాత డోక్లామ్ ఆందోళనల సమయంలో ఇరు దేశాల మధ్య డైరెక్ట్ విమానయాన సేవలు పూర్తిగా నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఇటీవల ప్రధాని మోడీ చైనా పర్యాటన తర్వాత ఇరు దేశాల విదేశాంగ మంత్రిత్వ శాఖలు విమాన సేవల పునరుద్ధరణకు సానుకూల నిర్ణయాన్ని తీసుకున్నాయి.

# రూ.999తో జావాయెజ్డీ ప్రీ బుకింగ్

ముంబయి : ప్రీమియం బైకుల తయారీ కంపెనీ జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ ప్రస్తుత పండగ సీజన్‌లో రూ.999తోనే తమ మోటార్ సైకిళ్లను ప్రీబుకింగ్ చేసుకోవచ్చని పేర్కొంది. జావా లేదా యెజ్డీ మోటార్ సైకిల్‌ను తమ వెబ్‌సైట్‌లో ముందస్తు బుకింగ్ చేసుకోవచ్చని తెలిపింది. 350 సిసి లోపు ఎనిమిది పెర్ఫార్మెన్స్ క్లాసిక్ మోటార్ సైకిల్స్‌పై జిఎస్‌టిని తగ్గించినట్లు జావా యెజ్డీ మోటార్ సైకిల్స్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ శరద్ అగర్వాల్ తెలిపారు. జిఎస్‌టి సవరణ తర్వాత తమ బైకుల ధరలు రూ.1.5 లక్షల నుంచి ప్రారంభవుతున్నాయన్నారు. వీటిపై నాలుగు సంవత్సరాలు లేదా 50వేల కిలోమీటర్ల వరకు వారంటీని అందిస్తున్నామన్నారు.



తుంగతుర్తి నియోజకవర్గం
ఈరోజు సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రానికి చెందిన మన తెలంగాణ సీనియర్ జర్నలిస్టు పూసపెల్లి యాదగిరి-కళ్యాణి దంపతుల కుమారుడు సాయి తేజ- రేవతి వివాహ వేడుక తిరుమలగిరి పట్టణంలోని =ఖా ఫంక్షన్ హాల్లో జరగగా నూతన వధూవరులను ఆశీర్వదించిన
తుంగతుర్తి శాసనసభ్యులు
గౌరవ శ్రీ మందుల సామేలు గారు



ఈరోజు సూర్యాపేట జిల్లా నాగారం మండలం పనిగిరి అనంద గార్డెన్ లో జరిగిన మంచిరెడ్డి పల్లి గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ నాతి నర్సయ్య,నాగమణి కుమారుడి పెళ్లి కి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన
తుంగతుర్తి శాసనసభ్యులు
గౌరవ శ్రీ మందుల సామేలు గారు





ఎల్కతుర్తి. మండల. పోలీస్ స్టేషన్ కు నూతనంగా బాధ్యతలు. తీసుకున్న..ఎఐ. నరసింహారావు.గారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి చిత్రపటాన్ని బహూకరించిన
మీ
గొర్రె మహేందర్.హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సి విభాగం అధ్యక్షులు



రేపు 14.05.2026 దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే శ్రీ నేనావత్ బాలు నాయక్ గారి కార్యక్రమాలు:
ఉదయం 8.00గంటలకు దేవరకొండ మండలం గన్యానాయక్ తండాలో శ్రీశ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో పాల్గొంటారు.
ఉదయం 9:00గంటలకు దేవరకొండ పట్టణంలోని 3వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
ఉదయం 9:30 గంటలకు కొండమల్లేపల్లి మండల కేంద్రంలో అంగన్వాడీ భవన నిర్మాణ పనులకు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజి నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేస్తారు అనంతరం ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు.
మధ్యాహ్నం 12:00 గంటలకు నల్గొండ జిల్లా కలెక్టరేట్ ఉదయాదిత్య భవన్ లో గౌరవ నల్గొండ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు అడ్లూరి లక్ష్మణ్ గారు,జిల్లా మంత్రులు శ్రీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు, శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి గార్లతో కలిసి ధాన్యం కొనుగోళ్లపై సమీక్షా సమావేశంలో పాల్గొంటారు.
ఇట్లు
ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం దేవరకొండ.




ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక లో భాగంగా విద్య పై స్థానిక సర్పంచులు మరియు స్థానిక కౌన్సిలర్స్ కి నిర్వహించిన అవగాహన సదస్సుకి హాజరైన శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు.అలాగే ఈ కార్యక్రమంలో నల్గొండ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ గారు, అదనపు కలెక్టర్, డి.ఈ.ఓ, మార్కెట్ కమిటీ చైర్మన్, స్థానిక కార్పొరేటర్ మరియు ఇతర స్థానిక నాయకులు పాల్గొన్నారు.




పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చుతున్న ప్రజా ప్రభుత్వం
దేవరకొండి ం వ్యాప్తంగా కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవాలు
మొదటి దశలో మంజూరైన ఇండ్ల నిర్మాణాలు పూర్తి కాబోతున్నాయి.
పెండింగ్ లో ఉన్న ఇండ్ల నిర్మాణాలను
త్వరగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ.
ఇందిరమ్మ ఇళ్లతో ప్రతి కుటుంబానికి సొంతింటి కల సాకారం.




బెట్టింగ్ చట్ట విరుద్ధం మరియు ప్రమాదకరం...
ఈసీ మనీ ఆశ, జీవితాన్ని నాశనం చేసే దారి
నేనావత్ దేవరన్ నాయక్
కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు





తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం..రేషన్ దుకాణాల్లో జొన్నలు
పేదల ఆకలి తీర్చేలా రేషన్ దుకాణాల్లో జొన్నలు పంపిణీ..అందరికీ ఆరోగ్యం దిశగా రేవంత్ రెడ్డి సర్కార్ కసరత్తు....
ప్రజా పంపిణీ ద్వారా జొన్నలు,మక్కలు పంపిణీకి నిర్ణయం..గురుకులాలు,వసతి గృహాల్లో బలవర్ధకమైన ఆహారం
నేనావత్ దేవరన్ నాయక్
కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు




ఎంపీ భువనగిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ గౌరవ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్న నాయకత్వం వర్ధిల్లాలి



# ఈనెల 21న నేరేడుచర్ల లో ప్రజానాట్య మండలి జిల్లా మహాసభలు



**నేరేడుచర్ల:-మే 13 అన్వేషనేత్రం**

ఈనెల 21వ తేదీన తెలంగాణ ప్రజానాట్యమండలి సూర్యాపేట జిల్లా నాలుగవ మహాసభలు నేరేడుచర్లలో నిర్వహిస్తున్నట్లు బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు తెలియజేశారు బుధవారం నాడు ఆయన నేరేడుచర్ల లోని సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ లో పాత్రికేయులతో మాట్లాడుతూ..... జనజీవన చైతన్యానికి మార్గదర్శి ప్రజా కళలని ప్రజా కళలతోనే సామాజిక చైతన్యం వెల్లివిరుస్తుందని సమాజ మార్పుకు ప్రజా చైతన్యానికి కళ ఒక ఆయుధం లాంటిదని ప్రపంచంలో జరిగిన అనేక ఉద్యమాలకు ముఖ్యంగా భారతదేశంలో జరిగిన స్వాతంత్ర పోరాటంలోనూ ప్రపంచ ప్రఖ్యాత తెలంగాణ సాయుధ పోరాటంలోనూ ఇటీవల కాలంలో జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన లోను కళలే వెన్ను దన్నుగా నిలిచాయని కవులు కళాకారులు రచయితల వల్లనే ప్రజా ఉద్యమాలు విజయవంతమయ్యాయన్నది చరిత్ర చెబుతున్న సత్యం అని ఆయన అన్నారు ముఖ్యంగా ప్రజానాట్యమండలి చరిత్ర మహోన్నతమైనది కళ కళ కోసం కాదని కళకాసుల కోసం కాదని కళ ప్రజల కోసం అని ఎందరో మట్టిలో మాణిక్యాల లాంటి కళాకారులను వెలికి తీసి శిక్ష ఇచ్చి కళా సైనికులను తయారు చేసిన ఘనత ప్రజానాట్యమండలి ది అని దేశం కోసం సరిహద్దుల్లో పోరాడే సైనికుడికి ప్రజా నాట్యమండలి కళాకారుడు దేనిలోలు తీసిపోడని ఆయన అన్నారు ఈ మహాసభకు జిల్లా నలుమూలల నుంచి ప్రజా కళాకారులు హాజరవుతారని తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు కురుమిద్దె శ్రీనివాస్ సూర్యాపేట జిల్లా సిపిఐ కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆయన తెలిపారు ఆయున వెంట రైతు సంఘం మండల అధ్యక్షుడు కత్తి శ్రీనివాసరెడ్డి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్ ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు పరికె భరత్ ఉన్నారు.

# నేరేడుచర్ల ఎస్సైగా సైదిరెడ్డి బాధ్యతలు స్వీకరణ

### మిర్యాలగూడ నుంచి నేరేడుచర్లకు బదిలీపై సైదిరెడ్డి




**నేరేడుచర్ల:-మే 13 అన్వేషనేత్రం**

మిర్యాలగూడ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సైదిరెడ్డి బదిలీపై నేరేడుచర్ల ఎస్సైగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తానని, ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆయన తెలిపారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. స్థానిక పోలీస్ సిబ్బంది ఆయనకు స్వాగతం తెలిపారు.



సూర్యాపేట పట్టణంలోని చీమా ఫంక్షన్ హాల్ లో మొగిలి ఎల్లయ్య గారి కుమారుని వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారుఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యండి అంజద్ అలి, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు కోడి నాగరాజు, కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అనంతుల యాదగిరి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, సేవదల్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయికృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దెబోయిన శ్రీనివాస్, చెంచల నిఖిల్,నాగు నాయక్, వాజిద్ మియా, ఎల్గురి వీరయ్య, పడిదల రవి, శ్రీ హర్ష చౌదరి, గుంటూరు చిట్టి బాబు, అమృ నాయక్, బొప్పాని లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కురవి మండలం పెద్దతండ గ్రామపంచాయతీలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డాక్టర్ జాటోత్ రామచంద్ర నాయక్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా గుగులోత్ కోటేష్ గారి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని నిర్వహించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు గృహ సౌకర్యం కల్పించేందుకు కట్టుబడి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యారంగంలో స్వర్ణయుగం: రేపటి తరాల భవిష్యత్తుకు భరోసా!: చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి




**- నిధుల కేటాయింపులో ప్రాధాన్యం:**

మన ప్రజా ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, బడ్జెట్‌లో ఏకంగా 8.22% నిధులను కేటాయించింది. ఇది కేవలం ప్రారంభం మాత్రమే; రాబోయే రోజుల్లో ఈ బడ్జెట్‌ను దశలవారీగా 15% వరకు పెంచడమే ప్రభుత్వ లక్ష్యం.

- యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్:

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కూడా అంతర్జాతీయ స్థాయి విద్యను అందించాలనే సంకల్పంతో “యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్”ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది.

- ఒక పెట్టుబడి - ఒక భవిష్యత్తు:

సీఎం రేవంత్ రెడ్డి గారు అన్నట్లుగా, విద్యార్థులపై పెట్టే ప్రతి రూపాయి ఖర్చు కాదు.. అది మన భవిష్యత్ తరాల మీద పెడుతున్న గొప్ప పెట్టుబడి. ఈ ఆలోచనతోనే విద్యా వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తున్నాం.

- మౌలిక సదుపాయాల కల్పన:

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, ఆధునిక ల్యాబ్స్ మరియు మెరుగైన సౌకర్యాలను కల్పించడం ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మన విద్యార్థులను తయారు చేస్తున్నాం.

- దేశానికే ఆదర్శం:

గుణాత్మకమైన విద్య, నైపుణ్యాభివృద్ధి మరియు ఉపాధి అవకాశాలను జోడిస్తూ తెలంగాణ విద్యారంగాన్ని దేశానికే రోల్ మోడల్‌గా నిలబెట్టబోతున్నాం.చదువుకున్న బిడ్డలే రాష్ట్రానికి అసలైన సంపద. మన ముఖ్యమంత్రి గారి దార్శనికతతో తెలంగాణ విద్యా వ్యవస్థలో సరికొత్త విప్లవం రాబోతోంది. పేద విద్యార్థుల కలలకు రెక్కలు తొడిగేందుకు మన ప్రభుత్వం సిద్ధంగా ఉంది.







ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా నకిరేకల్ పట్టణంలోని సాయిబాబా ఆలయ మందిరంలో నిర్వహించిన “విద్యా రంగం పై” అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, ప్రజలు పాల్గొని విద్యా రంగ అభివృద్ధి, విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యా రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అలాగే నకిరేకల్ మండలం కడపర్తి గ్రామంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు.ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక విద్యా సదుపాయాలు, నాణ్యమైన బోధన అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.





సూర్యాపేట పట్టణంలోని రాం డిగ్రీ కళాశాల మైదానంలోని చెన్నారెడ్డి ఆడిటోరియంలో పట్టణ బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బూర బలసైదులు గౌడ్ గారి మేనకోడలు వివాహ మహోత్సవానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గారు ఈ కార్యక్రమంలో సూర్యాపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు యండి అంజద్ అలి, చివ్వేంల మండల పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మున్సిపల్ కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, చిలుముల సునీల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అనంతుల యాదగిరి, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం చైర్మన్ తంగేళ్ల కరుణాకర్ రెడ్డి, సేవదల్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బొడ్డు సాయికృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్దెబోయిన శ్రీనివాస్, చెంచల నిఖిల్,నాగు నాయక్, వాజిద్ మియా, పడిదల రవి, శ్రీ హర్ష చౌదరి, గుంటూరు చిట్టి బాబు, అమృ నాయక్, బొప్పాని లలిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన -- ఎంపీ గడ్డం వంశీకృష్ణ





పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ కొనుగోలు కేంద్రాన్ని ఎంపీ గడ్డం వంశీకృష్ణ సందర్శించి అక్కడున్న రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ధాన్యం తూకం విధానం, కొనుగోలు ప్రక్రియ, నిల్వ సౌకర్యాలపై రైతులు వ్యక్తం చేసిన ఇబ్బందులను ఆయన పరిశీలించారుఈ సందర్భంగా జిల్లా మార్కెటింగ్ అధికారితో మాట్లాడిన ఎంపీ, రైతుల సమస్యలను పట్టించుకోకపోవడంపై నిర్లక్ష్యం ఎందుకు జరుగుతోందో ఆరా తీశారు. మార్కెట్ యార్డులో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, పారదర్శక తూకం విధానం మరియు వేగవంతమైన కొనుగోలు ప్రక్రియ అమలు చేయాలని సూచించారు.రైతులు ఇబ్బందులు పడకుండా వెంటనే చర్యలు తీసుకుని సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులకు న్యాయం జరగడం తన ప్రాధాన్యత అని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.



చిట్యాల మున్సిపాలిటీ పరి ధి లో ఆగు నరసింహ కూతురు వివాహానికి హాజరైన విపునగరికల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నగారు హాజరు కావడం జరిగింది. 9వార్డు కౌన్సిలర్ ఏర్పుల పరమేష్ ఆగు వెంకన్న



నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కొండ సైదులు కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి.,నకిరేకల్ మండలం మార్రూర్ గ్రామానికి చెందిన జక్కల వీరయ్య కుమారుడి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన.,ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు..




RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## ఆట



# ఊర్విల్ పటేల్ అరుదైన రికార్డు

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక అద్భుతం చోటుచేసుకుంది. చెన్నై సూపర్ సింగ్స్ యువ ఆటగాడు ఊర్విల్ పటేల్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగిపోయాడు. కేవలం 13 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసి ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా 50 పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో చేరిపోయాడు. నేడు చెన్నై వేదికగా లక్నో సూపర్ జయంట్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. దీంతో సురేష్ రైనా పేరిట ఉన్న పదేళ్ల రికార్డును సమం చేశాడు. రైనా 2014లో పంజాబ్ మీదనే 13 బంతుల్లో హాఫ్ సెంచరీ బాదాడు. ఇప్పుడు ఊర్విల్ అదే ఘనత సాధించడం విశేషం. మైదానం నలుమూలలా ఫోర్లు, సిక్సర్లతో విరుచుకుపడుతూ ప్రత్యర్థి బౌలర్లను ముప్పుతిప్పలు పెట్టాడు. ఈ ఇన్నింగ్స్ చూసిన అభిమానులు ఆశ్చర్యంలో మునిగిపోయారు. పవర్ ప్లే సమయంలోనే ఊర్విల్ తన బ్యాట్ పవర్ ఏంటో చూపించాడు. గ్రౌండ్‌లో ప్రతి బంతిని బౌండరీకి పంపుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. తన అద్భుతమైన హిట్టింగ్ తో స్టేడియం మొత్తం హోరెత్తిపోయేలా చేశాడు. లక్నో బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా విరుచుకుపడ్డాడు. తన ఇన్నింగ్స్‌లో మొత్తం 8 సిక్సర్లు, 2 ఫోర్లు బాదాడు. పవర్ ప్లే ముగియకముందే తన హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. వేలంలో తక్కువ ధరకు అమ్ముడైన ఈ ఆటగాడు ఇప్పుడు సంచలనంగా మారాడు. జట్టు విజయంలో కీలక పాత్ర పోషిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాడు.గతంలో సురేష్ రైనా 2014లో పంజాబ్ మీదనే కేవలం 13 బంతుల్లో యాభై పరుగులు చేశాడు. దశాబ్ద కాలంగా ఆ రికార్డు చెక్కుచెదరకుండా ఉంది. ఇప్పుడు ఊర్విల్ పటేల్ రైనాతో కలిసి ఉమ్మడి రికార్డును నెలకొల్పాడు. ఐపీఎల్ లో అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన రికార్డు యశస్వి జైస్వాల్ (13 బంతులు) పేరిట ఉంది. కెఎల్ రాహుల్ 14 బంతుల్లో ఈ ఘనత సాధించాడు.







## ముంబై ఇండియన్స్‌కు హార్దిక్
# పాండ్యా గుడ్ బై..?

ముంబై ఇండియన్స్‌లో ఏం జరుగుతోంది..? కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిజంగానే గాయపడ్డాడా..? లేదా కావాలనే గత రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడా..? మేనేజ్‌మెంట్‌తో విభేదాల రావడంతో టీమ్‌ను వీడాలని నిర్ణయించుకున్నాడా..? ఈ ప్రశ్నలకు బలాన్ని చేకూర్చేలా ముంబై ఇండియన్స్ అకౌంట్‌ను అన్‌ఫాలో చేసి.. కొన్ని గంటల తర్వాత మళ్లీ ఫాలో చేయడం చర్చనీయాంశంగా మారింది. తన సోషల్ మీడియా ఖాతాల్లో ముంబై ఇండియన్స్‌కు చెందిన పోస్టులను మొత్తం డిలీట్ చేశాడు. గత సీజన్‌లో ప్లే ఆఫ్స్‌కు చేరిన ముంబై.. ఈసారి దారుణమైన ప్రదర్శనతో పాయింట్ల పట్టికలో కింది నుంచి రెండో స్థానంలో ఉంది. ఆడిన 11 మ్యాచ్‌ల్లో కేవలం మూడు విజయాలు మాత్రమే సాధించింది. ప్లే ఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా తప్పుకుంది. మొదటి మ్యాచ్‌ను విజయంతో ఆరంభించినా.. ఆ తరువాత టీమ్ పూర్తిగా గాడి తప్పింది.

# గోల్డెన్ డకౌట్లలో ముందు వరుసలో కోహ్లీ

ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. ఆడిన తొలి బంతికే కోహ్లీ పెవిలియన్‌కు చేరుకున్నాడు. దీపక్ చాహర్ బౌలింగ్‌లో రాజ్ బవా క్యాచ్ అందుకోవడంతో ఔట్ అయ్యాడు. దీంతో విరాట్ కోహ్లీ నిరాశగా పెవిలియన్ బాట పట్టాడు. ఐపీఎల్ చరిత్రలో కోహ్లీకి ఇది 12 డకౌట్ కాగా.. 8వ గోల్డెన్ డకౌట్ కావడం గమనార్హం. ఇక ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు గోల్డెన్ డకౌట్ అయిన జాబితాలో కోహ్లీ మూడవ స్థానంలో నిలిచాడు. ఇక ఈ జాబితాలో రషీద్ ఖాన్ ఫస్ట్ ప్లేస్‌లో ఉన్నాడు. అతడు 12 సార్లు గోల్డెన్ డకౌట్‌గా పెవిలియన్‌కు చేరుకున్నాడు. ఆ తరువాత గ్లెన్ మాక్స్‌వెల్ ఉన్నాడు. అతడు 10 సార్లు గోల్డెన్ డకౌట్ అయ్యాడు.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA



# విశ్వంభర మూవీ పై భారీ అంచనాలు

మెగాస్టార్ చిరంజీవి హీరోగా దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం విశ్వంభరపై మరోసారి సోషల్ మీడియాలో ఆసక్తికర చర్చ మొదలైంది. భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా విడుదల చేయనున్నారనే వార్తలు ఇటీవల వైరల్‌గా మారాయి. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయికగా నటిస్తోంది. చాలా కాలం క్రితమే విడుదల కావాల్సిన ఈ సినిమా, పలు కారణాలతో వరుసగా వాయిదా పడుతూ వస్తోంది. ముఖ్యంగా ప్రస్తుతం టాలీవుడ్‌లో సీక్వెల్స్ ట్రెండ్ బలంగా కొనసాగుతున్న నేపథ్యంలో, 'విశ్వంభర'ను కూడా రెండు భాగాలుగా తీసుకురావాలని మేకర్స్ ఆలోచిస్తున్నారనే ప్రచారం జోరందుకుంది. అయితే ఈ వార్తలపై దర్శకుడు వశిష్ట తాజాగా స్పందిస్తూ క్లారిటీ ఇచ్చారు. 'రెండు పార్ట్స్‌గా వస్తున్న విశ్వంభర' అంటూ సోషల్ మీడియాలో వచ్చిన ఓ పోస్టుకు స్పందించిన ఆయన.. 'అవునా.. నిజమా?' అంటూ వెటకారంగా రిప్లై ఇచ్చారు. దీంతో ప్రస్తుతం ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలయ్యే ఆలోచన లేదనే విషయం స్పష్టమైంది. ఇక సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినప్పటికీ, విడుదల మాత్రం ఇంకా ఆలస్యమవుతోంది. దీనికి ప్రధాన కారణం భారీ స్థాయిలో జరుగుతున్న విజువల్ ఎఫెక్ట్స్, గ్రాఫిక్స్ పనులేనని సినీ వర్గాలు చెబుతున్నాయి.





# 2027 డిసెంబర్‌కు కల్కి-2 విడుదలకు ప్లాన్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, వైవిధ్యభరిత దర్శకుడు నాగ్ అశ్విన్ కలయికలో వచ్చిన కల్కి 2898 ఎడి భారతీయ సినిమా స్థాయిని ప్రపంచవ్యాప్తంగా మరోస్థాయికి తీసుకెళ్లిన సంగతి తెలిసిందే. వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించిన ఈ విజువల్ వండర్ ఇప్పుడు రెండో భాగంతో మరింత భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుందనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని పెంచుతున్నాయి.మొదటి భాగం ముగింపులో వచ్చిన ట్విస్టులు, ప్రభాస్ పాత్రకు సంబంధించిన ఎలివేషన్స్, కమల్ హాసన్ ఎంట్రీ ప్రేక్షకుల్లో భారీ ఉత్కంఠను రేకెత్తించాయి. దీంతో ఇప్పుడు అందరి దృష్టి 'కల్కి 2'పైనే ఉంది.తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని 2027 డిసెంబర్ నాటికి విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. భారీ స్థాయిలో ఉండే విజువల్ ఎఫెక్ట్స్, సీజీఐ పనుల కోసం ఎక్కువ సమయం అవసరమవుతుండటంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి విజువల్స్‌తో భారతీయ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి ఇవ్వాలనే లక్ష్యంతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ ప్రాజెక్ట్‌ను ఎంతో ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. ఇప్పటికే మొదటి భాగం చిత్రీకరణ సమయంలోనే సీక్వెల్‌కు సంబంధించిన సుమారు 30 శాతం షూటింగ్ పూర్తయినట్లు సమాచారం. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్స్‌లో అమితాబ్ బచ్చన్,కమల్ హాసన్ లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ప్రభాస్ ప్రస్తుతం 'స్పిరిట్', 'ఫౌజీ' వంటి భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, వచ్చే ఏడాది ప్రారంభంలో 'కల్కి 2' కీలక షెడ్యూల్స్‌లో పాల్గొనే అవకాశం ఉందని సమాచారం. మేకర్స్ ప్రణాళిక ప్రకారం 2027 ఏప్రిల్ నాటికి మొత్తం షూటింగ్ పూర్తి చేసి, ఆ తర్వాతి నెలలను పూర్తిగా పోస్ట్ ప్రొడక్షన్ పనులకే కేటాయించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.ఈ సీక్వెల్‌లో ప్రభాస్ పోషిస్తున్న భైరవ, కర్ణ పాత్రలకు మరింత ప్రాధాన్యం ఉండనుందని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్, కమల్ హాసన్ మధ్య జరిగే పవర్‌ఫుల్ పోరాట సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలుస్తాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. మొదటి భాగం కేవలం కథకు పరిచయం మాత్రమేనని, అసలు యుద్ధం రెండో భాగంలోనే ప్రారంభమవుతుందని దర్శకుడు నాగ్ అశ్విన్ ఇప్పటికే సంకేతాలు ఇచ్చారు. దీంతో 'కల్కి 2'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అన్ని అనుకున్నట్లే జరిగితే 2027 డిసెంబర్‌లో 'కల్కి 2' ప్రపంచవ్యాప్తంగా భారీ సంచలనం సృష్టించడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# విజయ్ పై ప్రియాంక వ్యాఖ్యలు వైరల్

గ్లోబల్ స్టార్‌గా ఓ వెలుగు వెలుగుతున్న ప్రియాంక చోప్రా సినీ ప్రయాణం ప్రస్తుత తమల సిఎం, హీరో విజయ్‌తో మొదలైంది. విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో, ఆయన గురించి గతంలో ప్రియాంక చోప్రా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో మళ్లీ వైరల్ అవుతున్నాయి. 2002లో విడుదలైన తమిజన్ సినిమాతో ప్రియాంక చోప్రా సినీ పరిశ్రమలో అడుగుపెట్టారు. ఈ చిత్రంలో విజయ్ హీరోగా నటించగా, ప్రియాంక హీరోయిన్‌గా కనిపించారు. అప్పట్లో కొత్తగా ఇండస్ట్రీలోకి వచ్చిన ప్రియాంకకు తమిళ భాష కూడా తెలియదట. ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. నాకు అప్పట్లో తమిళం అస్సలు రాదు. డైలాగులను కాగితంపై రాసుకుని బట్టీ పట్టి చెప్పేదాన్ని. సినిమాల షూటింగ్ ఎలా జరుగుతుంది? సెట్స్‌లో పరిస్థితులు ఎలా ఉంటాయి? అనే విషయాలపై కూడా పెద్దగా అవగాహన లేదు. థియేటర్‌లో సినిమాలు చూడడమే నాకు తెలిసిన అనుభవం అంటూ గుర్తుచేసుకున్నారు. అయితే 'తమిళన్' షూటింగ్ సమయంలో విజయ్‌కు ఉన్న అభిమాన గణాన్ని చూసి తాను పూర్తిగా ఆశ్చర్యపోయానని ప్రియాంక తెలిపారు. షూటింగ్ జరుగుతున్న ప్రదేశాలకు వందలాది అభిమానులు వచ్చేవారని, సెట్స్‌లోకి రావడానికి కూడా పోటీ పడేవారని చెప్పారు. విజయ్ డ్యాన్స్ చేస్తున్నా, డైలాగులు చెబుతున్నా అభిమానులు ఆయననే చూస్తూ ఉండేవారు. ఆ క్రేజ్ చూసి నేను షాక్ అయ్యాను.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434